## క్రైం కథ

# ప్రతీకారం

శివ సూర్య గేటుకు వేళ్లాడుతున్న ఆ బోర్డును చూసి గోవర్ధన హెల్త్ క్లినిక్ ఎదురుగా వున్న పెద్ద వేప చెట్టు కింద నిలబడిపోయాడు. పెద్ద అట్ట మీద తెల్ల కాయితాన్ని అంటించి వంకరటింకరగా రాసిన అక్షరాలు...


–కాంపౌండర్ కావలెను. అని వుంది. ఆ అక్షరాలను చదవగానే శివసూర్య కనులు మెరిసాయి. ఎందుకంటే పంకజాక్షి తరచుగా ఆ హెల్త్ క్లీనిక్‌కు వస్తుంది కాబట్టి. డాక్టర్ గోవర్ధనం పంకజాక్షికి, ఆమె భర్త ఈశ్వరమూర్తి కుటుంబానికి ఫ్యామిలీ డాక్టర్. ఎంత చిన్న వైద్య సహాయం అవసరమైనా వాళ్లు ఆ క్లినిక్‌ను దర్శిస్తూ వుంటారు. ఇంతకు ముందు కొన్నేళ్ల క్రితం పంకజాక్షితో కలిసి శివసూర్య అక్కడకు వచ్చాడు.

శివసూర్య జేబులోంచి రత్నా జరదా పాన్ తీసి నోట్లో వేసుకున్నాడు. అతనికి జర్దా పాన్ వేసుకునే అలవాటు ఉంది. అక్కడకు దగ్గరలోనే వున్న స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ ఆ బోర్డు చూసి ఆగిపోయేడు.

వేప చెట్టు కింద చల్లగా వుంది.

ఆ బోర్డును చూడగానే అతడి మనసులో ఒక ఆలోచన రూపుదిద్దుకుంది. ఆలస్యం చెయ్యకూడదనీ, త్వర పడాలనీ అనుకున్నాడు. ఆ బోర్డు ఎన్ని రోజుల నుంచి వున్నదో తెలీదు. ఇప్పటికీ అలాగే వున్నదంటే ఆ ఉద్యోగం ఖాళీగా వున్నదని అనుకున్నాడతను.

శివసూర్య ఇలా అనుకుంటున్నప్పుడు గోవర్ధన్ హెల్త్ క్లినిక్ ముందు ఆటో



ప్రతాప రవిశంకర్

ఆగింది. అందులో నుంచి దిగుతున్న పంకజాక్షిని చూసి శివసూర్య ఆమెకు తను కనపడకుండా వుండడానికి చెట్టు చాటుకు తప్పుకున్నాడు.

పంకజాక్షి ఈడ్చుకుంటూ నడిచి క్లినిక్‌లోకి వెళ్లింది. ఆమెను చూడడంతోనే అతడిలో కోపం చెలరేగింది. కళ్లు ఎరుపు రంగును పులుముకున్నాయి. ఆమె తమకు చేసిన నమ్మకద్రోహం గుర్తుకు వచ్చింది. కాలిపోయిన తన చెల్లెలి జీవితం కళ్ల ముందు కదిలింది.

ఈ అవకాశాన్ని వినియోగించుకొని తను ప్రతీకారం తీర్చుకోవాలి. ఇక ఆలస్యం చెయ్యకూడదనుకొని శివసూర్య అక్కడినుంచి కదిలి ఆటో ఎక్కి లలితా నగర్‌లో వున్న తన ఇంటికి వెళ్లాడు. శివసూర్య భార్య కరుణ ఇంట్లో లేదు. నాలుగు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది.

అతను గబగబా తన రూపాన్ని మార్చుకున్నాడు. గుబురుగా వున్న మీసాలను పూర్తిగా తీసేశాడు. మధ్య పాపిడి తీసి నున్నగా తలదువ్వుకున్నాడు. రంగుపోయిన బూడిదరంగు ప్యాంటు వేసుకొని, బాగా పైకి పోయిన పొట్టి చేతుల షర్టు వేసుకున్నాడు.

ఆ వేషంలో తనని పంకజాక్షి చూసినా గుర్తుపట్టలేదని అనుకున్నాడతను. అలా అనుకొని అతను ఆటో ఎక్కి తిరిగి గోవర్ధన్ హెల్త్ క్లినిక్‌కు వచ్చాడు. పేషెంట్లు ఎవరూ లేరు. తన గదిలో సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు డాక్టర్ గోవర్ధనం.

డాక్టర్ గోవర్ధనంకు నమస్కారం చేసి తనను పరిచయం చేసుకున్నాడు శివసూర్య లోపలకు వెళ్లి. గోవర్ధనం శివసూర్యని కొన్ని ప్రశ్నలడిగి తృప్తి కలిగిన తర్వాత అతడికి కాంపౌండర్ ఉద్యోగాన్ని ఇస్తున్నట్లుగా చెప్పి ఆ మర్నాటి నుంచి ఉద్యోగంలో చేరమని చెప్పాడు. ఆయనకు థాంక్స్ చెప్పి బయటకు వచ్చాడు శివసూర్య.

ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు శివసూర్య. అతను ఇంతకు ముందు తన స్నేహితుడైన ఓ ఆరెంపీ డాక్టరు దగ్గర ఇంజెక్షన్ చెయ్యడం, కట్లు కట్టడం లాంటివి నేర్చుకున్నాడు. తన ఇంట్లో వాళ్లకు ఉపయోగపడుతుందని. ఆ రోజు సాయంత్రం శివసూర్య ఆఫీసుకు వెళ్లి రెండు నెలలకు మెడికల్ లీవు అప్లయ్ చేశాడు. ఆ రాత్రి హోటల్‌లో భోజనం చేసి వచ్చి డాబా మీద పడుకున్నప్పుడు అతనికి చాలా రిలీఫ్‌గా అనిపించింది. అనుకోకుండా వచ్చిన అవకాశం. పంకజాక్షి మీద ప్రతీకారం తీర్చుకోవడానికి ఇంతకు మించిన అవకాశం మరొకటి రాదు. ఈ అవకాశాన్ని తను సద్వినియోగపరుచుకోవాలి. పంకజాక్షి తనని గుర్తుపట్టకుండా జాగ్రత్తపడాలి. ఇలా ఆలోచిస్తున్నప్పుడు పంకజాక్షి తమకు చేసిన ద్రోహం మళ్లీ గుర్తుకు వచ్చింది.

పంకజాక్షి వాళ్లు ఇంతకు ముందు విజయవాడలో శివసూర్య వాళ్లు వుంటున్న పక్క పోర్షన్‌లో వుండేవాళ్లు. రెండు కుటుంబాల మధ్య మంచి స్నేహం వుండేది. కొన్నేళ్ల క్రితం పంకజాక్షి భర్త ఈశ్వరమూర్తికి హైదరాబాద్‌కు బదిలీ అయినందున అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆపైన ఏడాదికి పంకజాక్షి హైదరాబాద్‌లోనే వుంటున్న తమ బంధువుల్లో ఒక యువకుడు వున్నాడనీ, వాళ్లు బాగా ఆస్తిపరులనీ, ఆ యువకుడు ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో మంచి ఉద్యోగం చేస్తున్నాడనీ, అతడిని శివసూర్య చెల్లెలు సుమతికి చేసుకొమ్మనీ చెప్పింది. పంకజాక్షి బంధువుల సంబంధం కాబట్టి ఆమె మాటలను నమ్మి వాళ్లు అడిగిన కట్నం ఇచ్చి చెల్లెలి పెళ్లి అతనితో జరిపించాడు.

తర్వాత తెలిసింది. చెల్లెలి భర్త నపుంసకుడనీ, తిండి పిచ్చి తప్పించి మరో ఆలోచన వుండదనీ... రెండు ఐస్‌క్రీంలు ఇప్పిస్తానంటే కోఠీలో ఆంధ్రాబ్యాంకు ఎదురుగా బట్టలు వూడదీసుకొని రెండుగంటలు ఉదయం పదిగంటల సమయంలో నిలబడే టైపనీ–

శివసూర్యకు పంకజాక్షి తమకు చేసిన మోసం అప్పుడర్థమయింది. తన బంధువుల్లో ఒక పాయింట్ ఫైవ్ వెధవకు పెళ్లి చెయ్యడం కోసం పంకజాక్షి తమను ఘోరంగా వంచించింది. బంధువుల మెప్పు కోసం తన లబ్ధి కోసం ఓ జీవితాన్ని కాల్చివేసింది. ఈ నాటకంలో పంకజాక్షి భర్త ఈశ్వరరావు కూడా తన శక్తి కొద్దీ నటించాడు. పైకి నిజాయితీపరుడిలా, మంచివాడిలా నీతులు చెప్పే ఆయన గొప్ప భార్యావిధేయుడు. భార్య మాటకు వంతపాడడమే తన జీవిత ధ్యేయంగా పెట్టుకున్న మనిషి. వ్యక్తిత్వం లేని అసమర్థుడు.

ఈ ఆలోచనలతో ఎప్పటికో నిద్రపోయిన శివసూర్య తెల్లారి స్నానం చేసి గోవర్ధన్ హెల్త్ క్లినిక్‌కు వెళ్లడానికి ముందు తమ ఎదురింటి మేడ మీద గదిలో వుంటున్న డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న మురళీకృష్ణ దగ్గరకు వెళ్లాడు. వెళుతూ ఓ ఖాళీ ఇంజెక్షన్ బాటిల్, డిస్పోజల్ సిరంజిని తీసుకెళ్లాడు.

వయసులో వున్నందున, చెడు తిరుగుళ్లు తిరిగే అలవాటు వున్నందున మురళీకృష్ణకు ఎయిడ్స్ సంక్రమించింది. ఈ విషయం శివసూర్యకు కొన్నాళ్లక్రితమే అతను చెప్పి ట్రీట్‌మెంట్ గురించి అడిగాడు.

"నువ్వోసాయం చెయ్యాలి." అన్నాడు శివసూర్య–మురళీకృష్ణతో.

"ఏమిటి?" అడిగాడు మురళీకృష్ణ.

"ఈ బాటిల్‌లో నీ బ్లడ్ కావాలి. ఐదొందలు ఇస్తాను."

అతను ఆశ్చర్యపడి " నా గురించి తెలిసే అడుగుతున్నారా? ఎందుకు?" అన్నాడు.

"నా ఫ్రెండ్ ఎయిడ్స్ క్రిముల గురించి ఓ పరిశోధన చేస్తున్నాడు. అతడికి ఓ ఎయిడ్స్ రోగి బ్లడ్ కావాలి" చెప్పాడు శివసూర్య.

మురళీకృష్ణ వొప్పుకున్నాడు. అప్పటికప్పుడే శివసూర్య ఇంజెక్షన్ బాటిల్ నిండా మురళీకృష్ణ బ్లడ్‌ను తీసుకొని క్లినిక్‌కి వెళ్లాడు.

ఉదయం పదకొండుగంటల సమయంలో ఆటో దిగి లోపలకు వొచ్చింది పంకజాక్షి. అప్పుడు శివసూర్య డాక్టర్ వున్న గదిలోనే వున్నాడు.

"ఈమె పంకజాక్షి గారు. మన క్లినిక్‌కి చాలా పాత పేషెంటు. ఈమెకు న్యూరోబియాన్ ఇంజెక్షన్ ఇవ్వు వస్తారు" అన్నాడు డాక్టర్ గోవర్ధనం.

"ఇతనెవరు?" శివసూర్యను పరీక్షగా చూస్తూ అడిగింది దెమ్మెశా దుక్కలా వున్న పంకజాక్షి.

"పుష్పనాథం. కొత్త కాంపౌండర్" చెప్పాడు గోవర్ధనం.

శివసూర్య తన పేరు పుష్పనాథం అని చెప్పాడు డాక్టరుతో... తర్వాత ఓ ఐదునిమిషాలకు పంకజాక్షిని పక్క రూములోకి పిలిచి తను తీసుకొచ్చిన మురళీకృష్ణ బ్లడ్‌ను సిరంజిలోకి ఎక్కించి పంకజాక్షి జబ్బకు ఇంజెక్ట్ చేశాడు.

"ఇంతకు ముందు నిన్నెక్కడో చూశాను. మీది ఏ వూరు?" అనుమానంగా అడిగింది పంకజాక్షి ఇంజెక్షన్ చేసిన చోట చేత్తో రుద్దుకుంటూ–

"మాది వేములవాడ. నాలాంటి వాడ్ని చూసి వుండరు" అన్నాడు శివసూర్య గొంతు మార్చి

***

నోటికి అడ్డుగా వులిపిరి కాయితాన్ని అడ్డం పెట్టుకొని "మూర్తి గారు కావాలి" అన్నాడు శివసూర్య. అతను నిర్జనంగా వున్న ఓ రోడ్డు మీద రూపాయి టెలిఫోన్ బాక్స్ ముందు నిలబడి వున్నాడు.

"మూర్తినే మాట్లాడుతున్నాను" అన్నాడు ఈశ్వరమూర్తి అవతలి వైపునుంచి.

"నీకో ముఖ్యమైన సమాచారం చెప్పాలి. నీ భార్య పంకజాక్షి ఎయిడ్స్‌రోగి."

"షటప్... ఏమిటి నువ్వనేది? ఆమె వయసు ఎంతో తెలుసా నీకు? ఇంతకీ నువ్వెవరు? నీ పేరేమిటి?" కోపంగా అడిగాడు ఈశ్వరమూర్తి.

శివసూర్య నవ్వి ఇలా అన్నాడు.

"ఎయిడ్స్‌కు వయసుతో సంబంధం లేదని నీకు తెలీదనుకుంటాను. ఇక నా పేరు జయ్. ఆమెకు ఎయిడ్స్ సంక్రమించడానికి నేను కారణం."

"అంటే?! వివరంగా చెప్పు"

"నో.. డీటెయిల్స్... నువ్వు తల బాదుకోకుండా ఒక విషయం చెపుతాను. గతంలో సుమతికి మీరు చేసిన ద్రోహానికి దేవుడి తరపున నేను మీకు విధించిన శిక్ష"

శివసూర్య కొత్త ఉద్యోగాన్ని ఆ రోజే మానేశాడు.